
ప్రజాశక్తి

శుక్రవారం 19 డిసెంబర్ 2025

5

పార్వతీపురం మన్యం



'నేషనల్ హెరాల్డ్ కేసులో న్యాయమే గెలిచింది'

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

నేషనల్ హెరాల్డ్ కేసులో న్యాయమే గెలిచిందని, ఎప్పుడూ సత్యమే జయిస్తుందని కాంగ్రెస్ నాయకులు వి.దాలినాయుడు, సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, కోలా కిరణ్ కుమార్, దేవుపల్లి చిరంజీవి, సాలూరు నియోజకవర్గం ఇంచార్జ్ గేదెల రామకృష్ణ అన్నారు. ఈ మేరకు స్థానిక హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద నిరసన చేపట్టారు. ఇప్పటికైనా పాలకులు బుద్ధి తెచ్చుకోవాలన్నారు.న్యాయాన్ని ఎవరు కప్పి పుచ్చలేరన్నారని సత్యమేవ జయతే అంటూ నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అధినాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ అక్రమంగా దాఖలు చేసిన చార్జ్‌షీట్‌పై విచారణను ధర్మాసనం తిరస్కరించి న్యాయస్థానంపై నమ్మకం పెంచిందన్నారు. ఈ మేరకు బిజెపి, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట "సత్యమేవ జయతే" నినాదాలతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు.

'ముస్తాబు'కు సిఎం కితాబు

ప్రజాశక్తి - పార్వతీపురం

కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి చేసిన వినూత్న ఆలోచనతో జిల్లాలో ప్రవేశపెట్టిన "ముస్తాబు" కార్యక్రమం తనను ఎంతో ఆకర్షించిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. జిల్లాలోని విద్యార్థులను తాను చూశానని, విద్యార్థులే కలెక్టర్ తెచ్చిన "ముస్తాబు" కార్యక్రమం చాలా బాగుందని చెప్పే పరిస్థితికి వచ్చారని కితాబిచ్చారు. చాలా మంది ఏదైనా పని చేయమంటే డబ్బులేవీ అని అడుగుతున్నారు. కానీ నిధుల్లేకుండానే అద్భుతమైన కార్యక్రమాలు చేయవచ్చని, దీనికి ఉదాహరణ "ముస్తాబు" కార్యక్రమమే అని అన్నారు. వినూత్న ఆలోచనలే ముఖ్యమని, అభివృద్ధి అంటే కేవలం నిధుల కేటాయింపు మాత్రమే కాదని, వినూత్న ఆలోచనలు, ఉత్తమ విధానాలతో సంపదను సృష్టించవచ్చని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమరావతి సచివాలయంలో రెండో రోజు జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో వినూత్న కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్న జిల్లా కలెక్టర్లను సిఎం అభినందించారు. ఈ సందర్భంగా మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర రెడ్డిని సిఎం ప్రశంసిస్తూ, ఇటువంటి వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర్ రెడ్డి మన్యంలో 'ముస్తాబు' కార్యక్రమం అమలును వివరించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందించటమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించామని, తద్వారా పాఠశాల పరిసరాలు కూడా శుభ్రంగా మారుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థుల హాజరు కూడా గణనీయంగా పెరుగుతోందని, రోగాల బారిన పడిన విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిందని వివరించారు. అనంతరం "ముస్తాబు" కార్యక్రమంపై రూపొందించిన వీడియోను కలెక్టర్ ప్రదర్శించగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు.



సిఎం సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి, ఎస్‌పి మాధవరెడ్డి

పిపిపి విధానం మానుకోవాలి : సిపిఐ

పార్వతీపురంటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం పిపిపి విధానాన్ని మానుకొని ప్రభుత్వపరంగా నడపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు డిమాండ్ చేశారు. పిపిపి విధానాన్ని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ మన్మథరావు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందని పరిస్థితికి ఈ విధానాలు దారితీసుకొస్తున్నట్లు ఆందోళన వ్యక్తంచేశారు. పిపిపి విధానం వల్ల ప్రభుత్వ రంగంలో స్థిరమైన ఉద్యోగావకాశాలు యువతకు అందకుండా పోతాయని, ప్రజారోగ్య హక్కులు, ప్రభుత్వ వైద్య, విద్యా వ్యవస్థలు విచ్ఛిన్నమవుతాయని హెచ్చరించారు. కావున విద్యాశాఖ మంత్రి లోకేష్ మరోసారి దీనిపై ఆలోచన చేసి ప్రభుత్వపరంగా నడిపేలా చేయాలని, లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు శ్రీకారం చూడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మండలంలోని వెంకంపేట పంచాయతీ పరిధిలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి గురువారం పర్యటించారు. వెంకంపేట పంచాయతీలో కొత్తగా నిర్మించ తలపెట్టిన ప్రభుత్వ భవనాల కోసం సబ్ కలెక్టర్ స్థల పరిశీలన చేశారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించి, వాటి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో భాగంగా పలు కీలక ప్రాంతాలను సందర్శించిన ఆమె అభివృద్ధి పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ వెంకంపేటలోని 'లంకెల చెరువు'ను సందర్శించారు. చెరువు ప్రస్తుత పరిస్థితిని, నీటి నిల్వ సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. చెరువు అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ అధికారులు, ఇతర ప్రభుత్వ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

సీనియర్ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాయాలని నిర్దేశించడం సరికాదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహన్ రావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010 సంవత్సరానికి ముందు ఉపాధ్యాయులుగా చేరిన వారు డీఎస్సీ ద్వారా నియామకమయ్యారని, ఆనాటికి టెట్ అనేది లేదన్నారు. కానీ 2009లో వచ్చిన విద్యాహక్కు చట్టం నేపథ్యంలో ఉపాధ్యాయులుగా ఉన్న వారంతా రెండేళ్లలో టెట్ పరీక్ష పాస్ కావాలని, లేనిచో వారు విధుల నుంచి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తీసుకోవాల్సి ఉంటుందని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. దీనివల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఇది విద్యార్థులకు బోధనలో నష్టం చేకూరుస్తుందని ఆయన తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో రివ్యూ పిటేషన్ వేయాలని, కేంద్ర ప్రభుత్వంచే కూడా పిటిషన్ వేయించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు వచ్చేందుకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు మాట్లాడుతూ పార్లమెంటులో విద్యాహక్కు చట్టానికి తగిన సవరణ చేయడం ద్వారా సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి శాశ్వతంగా పరిష్కారం దొరుకుతుందన్నారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆదివారాలు, సంక్రాంతి సెలవుల్లో కూడా ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరు కావాలని ఆదేశాలు వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలలుగా ఉన్నచోట ఉపాధ్యాయులకు సెలవులు వినియోగించుకునే అవకాశం లేకుండా పోతుందని, కావున దానికి తగిన పరిష్కారం విద్యాశాఖ అధికారులు చూపాలని ఆయన కోరారు.

గిరిజన సంక్షేమ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్



కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులను నైట్ వాచ్మెన్‌గా పరిగణించడం తగదు

గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను నైట్ వాచ్మెన్ గా పరిగణించడం తగదని మురళీమోహనరావు అన్నారు. రాత్రి 9 గంటల నుంచి 12 గంటలకు తెల్లవారుజామున 6 గంటలకు ఫోటోలు అప్లోడ్ చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడం సరికాదని ఆయన విమర్శించారు. ఎటువంటి సౌకర్యాలు లేకుండా రాత్రిపూట మహిళలను కూడా పాఠశాలలో బస చేయాలని ఆదేశించడం దుర్మార్గమన్నారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యలకు ఉపాధ్యాయులను భాద్యులను చేయటం సరికాదని, వారికి మెనూ చార్జీలు పెంచి పౌష్టికాహారం అందించాలని కోరారు. అలాగే ఎఎన్ఎంలను, రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య సమస్యలకు ఉపాధ్యాయుని బాధ్యతలు చేసి సస్పెండ్ చేయటం జరిగిందని విమర్శించారు. అలాగే ఇటీవల రాత్రి 11 గంటలకు విజిట్ చేసిన అధికారులు అక్కడ ఉపాధ్యాయుడు రాత్రి బసలో లేరన్న కారణంతో రెండు ఇంక్రిమెంట్ల కోత విధించడం సరైన చర్య కాదని, తక్షణమే చర్యలు విరమించుకోవాలని సస్పెండ్ అయిన ఉపాధ్యాయులను రీ ఇన్ స్టేట్ చేయాలని క్రమశిక్షణ చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఒ కె.హేమలతకు వినతిని అందజేశారు. నిరసన కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో జెసి తనిఖీలు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పలు గ్రామాల్లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలను ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా పి.కోనవలస, పద్మాపురాల్లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల, పాచిపెంటలోని మినీ గురుకులం, గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల, బడ్నాయక వలసలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలను సందర్శించారు. గురుకుల బాలుర పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించిన పిఒ పాఠశాలలోని బోధనా గదులు, పరిసరాలు, మరుగుదొడ్లు, తాగునీరు, డార్మిటరీలను పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరీక్షించిన ఆయన పాఠశాలలోని వసతులు, భోజన నాణ్యత, విద్యా బోధనపై ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడంలో ఎటువంటి అలసత్వం వహించరాదని ఉపాధ్యాయులకు వార్డెన్లకు ఆదేశించారు. ప్రతి విద్యార్థి పాస్ కావాలని, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.



విద్యార్థులతో ముచ్చటిస్తున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలగకూడదు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జెసి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పి. కోనవలసలోని రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, ఇప్పటివరకు జరిగిన ధాన్యం సేకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం నిల్వలు పెరగకుండా వెంటనే మిల్లులకు ట్యాగింగ్ చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించారు.

పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ

పాచిపెంటలో గల పిహెచ్‌సిని జెసి యశ్వంత్ కుమార్ రెడ్డిఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న వైద్య సేవలను సమీక్షించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను స్వయంగా పరిశీలించి, రోగులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలు, ఓపి నమోదు, మందుల స్టాక్ రిజిస్టర్లను జేసీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గడువు ముగిసిన మందులు లేకుండా జాగ్రత్త వహించాలని సిబ్బందిని ఆదేశించారు. గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న ప్రసవ పూర్వ సేవలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని, మాతా-శిశు మరణాల లేకుండా ఉండేందుకు కషి చేయాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు, వార్డుల్లో పరిశుభ్రతపై జెసి అసంతృప్తి వ్యక్తం చేశారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి, వారికి డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారా లేదా, మందులు ఉచితంగా ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ఆసుపత్రిలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో తహశీల్దార్ డి.రవి, ఎంపిడిఓ పాత్రో, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి మరణంలో దాపరికమెందుకో?

- ఉపాధ్యాయుల తప్పు లేదని తల్లిదండ్రులతో పూచీకత్తు
- దొర జమ్ము పాఠశాల ఉదంతంపై అనుమానాలు
- భగ్గుమంటున్న గిరిజన సంఘాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

గుమ్మలక్ష్మీపురం మండలం దొరజమ్ము గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థి తాడంగి అనీష్ మృతి పట్ల దుమారం రేపుతోంది. ఒకరోజు వ్యవధిలో విద్యార్థి ఫిట్స్‌తో మరణించాడని చెప్పడం వివాదాస్పదమవుతోంది. పాఠశాల ఉపాధ్యాయుల తప్పు లేదని విద్యార్థి తల్లిదండ్రులతో లిఖిత పూర్వక పూచీకత్తు తీసుకోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. ఈనెల 13న అనీష్ చిన్నాన్న కూతురు మరణించడంతో పాఠశాలకు ఆయన తల్లిదండ్రులు వచ్చి ఆయన్ను తీసుకెళ్ళారు. సమీప బంధువు కడసారి చూపు కోసం అనీష్‌ను తల్లిదండ్రులు డెక్కిన డోరమ్మ పాఠశాల హెచ్ఎం, వార్డెన్ లను బతిమలాడి తీసుకెళ్ళారు. అంతవరకు బాగానే ఉంది. మరుసటిరోజు అంటే ఈనెల 14న ఉదయం విద్యార్థి తాడంగి అనీష్ ఫిట్స్‌తో మరణించాడని తల్లిదండ్రులు రాసిచ్చిన పూచీకత్తు లేఖలో ఉంది. ఒక రోజు వ్యవధిలో విద్యార్థి ఫిట్స్‌తో మరణించాడని చెప్పడం, ఈ విషయాన్ని పాఠశాల యాజమాన్యం గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫిట్స్ అనేది ఒక్కరోజులో బయటపడే అనారోగ్య సమస్య కాదు. ఎప్పటి నుంచో అనీష్‌కు ఫిట్స్ సమస్య వుండైనా వుండాలి లేదా వేరొక సమస్యతో మరణించి వుండాలి. విద్యార్థి మృతి చెందిన వారం రోజుల తర్వాత వెలుగులోకి రావడం చర్చనీయాంశమవుతోంది. ఏజెన్సీలోని ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలను ఇదేవిధంగా ఎంతమంది మరుగున పెడుతున్నారనే ప్రశ్న తలెత్తుతోంది. గిరిజన సంక్షేమ శాఖ అధికారుల సహకారంతోనే పాఠశాల సిబ్బంది విద్యార్థుల మరణాలు దాచిపెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ తప్పులు బయటపడకుండా ఉండడానికి విద్యార్థి అనీష్ తల్లిదండ్రులతో పూచీకత్తు తీసుకోవడం అధికారుల సలహా మేరకే జరిగి వుంటుందనే ప్రచారం జరుగుతోంది.

సమగ్ర విచారణ జరిపించాలి: గిరిజన సంఘాలు

దొర జమ్ము గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి విద్యార్థి తాడంగి అనీష్ ఫిట్స్‌తో మరణించడంపై సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్, అధ్యక్షుడు తాడంగి సాయిబాబు, గిరిజన సంఘం నాయకులు ఐ.రామకృష్ణ, ఆరిక చంద్రశేఖర్, దుక్క సీతారాం, పల్లా సురేష్ గిరిజన సంక్షేమ డిడి విజయశాంతిని గురువారం కలిశారు. విద్యార్థి తల్లిదండ్రులతో పూచీకత్తు తీసుకోవడం సరికాదన్నారు. ఒక్కరోజులో ఫిట్స్‌తో మరణించాడని చెప్పడం సరికాదని విద్యార్థి మరణాన్ని దాచి పెట్టాల్సిన అవసరం ఎందుకని ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వింత పోకడలు

- ఆస్తుల క్రయవిక్రయాలకు అడ్డగోలు అభ్యంతరాలు!
- అవసరానికి ఆస్తులు అమ్ముకోలేక ప్రజల అవస్థలు
- ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న రిజిస్ట్రార్ తీరు

ప్రజాశక్తి- సాలూరు

స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రస్తుతం వివాదాలకు నిలయంగా మారింది. నిబంధనల ప్రకారం ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయాల్సిన అధికారులు, అడ్డగోలు అభ్యంతరాలతో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ సొంత ఆస్తులను అమ్ముకోవాలన్నా, కొనుగోలు చేయాలన్నా రిజిస్ట్రార్‌కు నచ్చితేనే పని జరుగుతుందని, లేదంటే అర్థం లేని కారణాలతో పత్రాలను వెనక్కి పంపుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై సాలూరు పట్టణానికి చెందిన పేర్ల విశ్వేశ్వరరావు, గంట తాతాజీలు గురువారం విలేకరుల సమావేశంలో తమకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారరు. 2021లో (డాక్యుమెంట్ నెం.3760) సాలూరు దిగువ స్టాండు సమీపంలో జి1 భవనాన్ని కొనుగోలు చేశానని, ఇప్పుడు దానిని విక్రయించేందుకు సిద్ధపడగా, రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు ఆ భూమిని రిజిస్టర్ చేయడం కుదరదని తెగేసి చెబుతున్నారని, నాలుగేళ్ల క్రితం ఇదే కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అయిన ఆస్తికి ఇప్పుడు ఎందుకు అభ్యంతరాలు చెబుతున్నారని పేర్ల విశ్వేశ్వర రావు ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో (డాక్యుమెంట్ నెం.3021) రేకుల షెడ్డుతో కూడిన ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేశానని ఐదేళ్ల క్రితం నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్ జరిగిందని, ఇప్పుడు తన అవసరాల కోసం అమ్మకానికి పెడితే అధికారులు అడ్డుపడుతున్నారని గంట తాతాజీ ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం వల్ల కేవలం వ్యక్తులే కాకుండా, ప్రభుత్వానికి రావాల్సిన లక్షలాది రూపాయల స్టాంప్ డ్యూటీ ఆదాయం కూడా నిలిచిపోతోందనీ, అధికారుల మొండి వైఖరి వల్ల క్రయవిక్రయదారులు కోట్లాది రూపాయల నష్టాన్ని చవిచూడాల్సి వస్తోందని బాధితులు మండిపడుతున్నారు. ఇదే విషయంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి రిజిస్టర్ ఆఫీస్‌లో సక్రమంగా కొనుగోలు అమ్మకాలు జరిగే విధంగా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



రిజిస్ట్రేషన్ పత్రాలను చూపుతున్న క్షతగాత్రులు



వైద్యాధికారులతో మాట్లాడుతున్న పిఆర్‌సి బృందం సభ్యులు

జిల్లాలో పిఆర్‌సి బృందం పర్యటన

మానసిక ఆరోగ్య కార్యక్రమాలపై పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం/సీతంపేట

భారత ప్రభుత్వం జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ద్వారా "జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం అమలు తీరును పరిశీలనకు కేంద్రం నుంచి పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ టీమ్ సభ్యులు డాక్టర్ రమణ యడ్ల, డాక్టర్ చీపురుపల్లి పాదాలు మన్యం జిల్లాలో గురువారం పర్యటించారు. ఈమేరకు జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావుతో కలిసి సీతంపేట ఏరియా ఆసుపత్రి, కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రాలను గురువారం సందర్శించారు. ముందుగా ఆసుపత్రి సూపరిండెంట్లు, స్పెషలిస్ట్ వైద్యులతో సమీక్షించి మానసిక ఆరోగ్య కార్యక్రమాలు, అందుతున్న మానసిక వైద్య సేవలు మరియు సిబ్బంది పనితీరును గురించి తెలుసుకుని రికార్డులు పరిశీలించి, సమీక్షించారు. అనంతరం ఆసుపత్రుల్లో వివిధ విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సీతంపేట కెజిబివి పాఠశాలను సందర్శించి మెంటల్ హెల్త్ కార్యక్రమాలపై సిబ్బంది అవగాహన, కౌన్సిలింగ్ కల్పిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకుని, మానసిక ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీతంపేట ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.శ్రీనివాసరావు, ఎన్‌సిడి నోడల్ ఆఫీసర్, కురుపాం ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ సునీల్ కుమార్, స్పెషలిస్ట్ వైద్యులు,సైకియాట్రిక్ సోషల్ వర్కర్ కృష్ణారావు, ఎన్‌సిడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై నిగ్గుతేల్చాలి

ప్రజాశక్తి - కొమరాడ

స్థానిక పంచాయతీలో దుర్వినియోగమైన రూ.21,15,997పై నిగ్గు తేల్చి ప్రజలకు సమాధానం చెప్పాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, కూటమి నాయకులు అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు సాంబమూర్తి, టిడిపి నాయకులు మరడాన వెంకటనాయుడు, కురుపాం ఎఎంసి డైరెక్టర్ నీరస శ్రీనివాసరావు, పిఎసిఎస్ సభ్యులు ఎస్.కృష్ణమూర్తి, జనసేన నాయకులు ఎస్.చంటి తదితరులు మాట్లాడారు. కొమరాడ పంచాయతీకి అభివృద్ధికి ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు పక్కతోవ పట్టాయని వీటిపై సమగ్ర దర్యాప్తు చేసి ఇప్పటి వరకు దుర్వినియోగమైన తేల్చిన నిధులపై రికవరీ చేసి గ్రామపంచాయతీకి తిరిగి కేటాయించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేసినా ఆడిట్ ఎలా చేస్తున్నారో అర్థం కావడం లేదని అన్నారు. ఎం-బుక్‌ను ఏ విధంగా పూర్తిచేశారనే విషయంపై దర్యాప్తు చేసి వాస్తవాలు తేల్చాలన్నారు. తక్షణమే నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోయినా, రికవరీ చేయకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు బి.తిరుపతిరావు, ఉడమల మురళి, ఎ.ఉపేంద్ర, మోహన్ రావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో అంబలిగండికి చెందిన గేదెల లక్ష్మి (32) శ్రీకాకుళంలో రిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది ఈనెల 15న లక్ష్మి కడుపునొప్పి తాళలేక మతిస్థిమితం కోల్పోయి ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా మారడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ధోనుభాయి ఎస్సై షేక్ మస్తాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త శోభన్ బాబు, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు



పిహెచ్‌సి వద్ద జెండా ఆవిష్కరణలో పాల్గొన్న అంగన్‌వాడీలు, ఆశాలు, సిహెచ్‌డబ్ల్యులు

సిఐటియు మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొమరాడ

ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగు సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పిహెచ్‌సి వద్ద సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కట్ట పెట్టేందుకు ప్రభుత్వ రంగాన్ని బలహీన పరుస్తున్నారని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా నికరమైన పోరాటాలు నిర్వహించేది సిఐటియు అని, అలాంటి సిఐటియు అఖిలభారత మహాసభలు మొట్టమొదటిసారి విశాఖలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభల జయప్రదానికి కార్మిక వర్గం, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి సిరికి అనురాధ, కొమరాడ అంగన్వాడీ సెక్టార్ లీడర్ జయమ్మ, ఆశా వర్కర్ల మండల నాయకులు రాజేశ్వరి, పార్వతి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నాయకులు దుర్గ, రాధా, పార్వతి, ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాచిపెంట : ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగుతున్న సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పాచిపెంటలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గంట జ్యోతి జ్యోతి లక్ష్మి పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కె.పార్వతీదేవి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. దేశానికి రక్షణ కావాలంటే కార్మిక, కర్షకులు ఐక్యతగా ఉండి ఉద్యమించి పోరాడాలని పిలుపునిచ్చారు. అఖిలభారత మహాసభలకు సహాయ సహకారాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మంచాల శ్రీనివాసరావు, కొర్ర కళ్యాణ్, సుబ్బారావు రైతు సంఘం నాయకులు బోర వెంకన్న, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దూరులో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురం సచివాలయం పరిధి పెద్దూరులో గురువారం స్థానిక వైద్యాధికారి ఎం.సాయి కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, చిన్నారులు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాల రోగాలకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శుభారామని, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్‌ఎం, 104 సిబ్బంది, ఆశా, గ్రామస్తులు పాల్గొన్నారు.

20 నుంచి డోర్ డెలివరీ మాసోత్సవాలు

ప్రజాశక్తి - పాలకొండ

ఎపిఎస్‌ఆర్‌టిసి లజిస్టిక్ విభాగంలో ఈనెల 20 నుంచి జనవరి 19 వరకు డోర్ డెలివరీ మాసోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ 84 ప్రధాన కేంద్రాలతో పాటు పట్టణంలో పది కిలోమీటర్ల పరిధిలో ఒక కేజీ నుండి 50 కేజీల వరకు పార్సిల్ డోర్ డెలివరీ చేస్తామన్నారు. తక్కువ ధరకే వేగంగా పార్సిల్ అందజేస్తామన్నారు. దీన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఘనంగా కేంద్రమంత్రి కింజరాపు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పాలకొండ

కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పుట్టినరోజు వేడుకలు సందర్భంగా గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పడాల భూదేవి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామ్మోహన్ నాయుడు మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ తెలుగు యువత మాజీ అధ్యక్షులు వారాడ సుమంత్ నాయుడు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు జయకర్, ఎఎంసి మాజీ ఛైర్మన్ ముంజేటి తిరుపాదరావు, గుమ్మడి సింహాద్రి, ఉమామహేశ్వరరావు, అనపాక ధనుంజయరావు తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దు

ప్రజాశక్తి - సీతానగరం

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయవద్దని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని అంటిపేటలో ఉపాధి హామీ చట్టం పని ప్రదేశంలో ఉపాధి కూలీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పద్ధతి ప్రకారమే మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం అమలు చేయాలని, 200 రోజులు పనులు కల్పించి, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 60 శాతం నిధులతో 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం పేరు మారుస్తూ చట్టాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ పార్లమెంట్లో పెట్టిన బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధివేతనదారులు మాలతి, సౌజన్య, పైల ఈశ్వరరావు, పైల చంద్రరావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మాతృభాష విద్యాబోధనను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కురుపాం

మాతృభాష విద్యా విధానాన్ని పునరుద్ధరించాలని ఉమ్మడి జిల్లాల ఎపిటిఎఫ్ గౌరవ అధ్యక్షులు బంకురు జోగినాయుడు, కార్యదర్శి మజ్జి ఉపేంద్ర, కార్యవర్గ సభ్యులు ఆకుల జగదీష్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల వద్ద వారు మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో 19,500 భాషలుండగా భారత రాజ్యాంగం 8వ షెడ్యూల్లో 22 ప్రాంతీయ భాషలు అధికార భాషలుగా ఉన్నాయని 8.11 కోట్ల మంది తెలుగు భాషను ఎంచుకున్నారని తెలుగు భాషలోనే సులభంగా అర్థం చేసుకోగలరని, మాతృభాషను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

జనసేనకు తిరుపతిరావు రాజీనామా

ప్రజాశక్తి - మక్కువ



జనసేన పార్టీ సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావు ఆ పార్టీకి, క్రియాశీలక సభ్యత్వానికి గురువారం రాజీనామా చేశారు. జనసేన పార్టీ పట్ల తనకు గౌరవం ఉందని, జిల్లా, మండలంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో రాజీనామా చేస్తున్నానని ఆయన ప్రకటించారు. ఈ రాజీనామా పూర్తిగా తన వ్యక్తిగతమని వెల్లడించారు. ఇప్పటివరకు తనకు సహకరించిన జనసైనికులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో వేరే పెద్దగా అభివృద్ధి తన లక్ష్యమని తెలిపారు. ఇకపై కూడా తనను అభిమానించే వారంతా సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా ఇంధన వారోత్సవాలు

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఏపీసీసిఐఎల్ చేపట్టిన ఇంధన వారోత్సవాలు గురువారం స్థానికగిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎఇ జి.నీలిమ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, సేవ్ ఇంధనం, విద్యుత్ పొదుపు గురించి పోటీలు నిర్వహించారు. విజేతలకు హెచ్ఎం టి.చంద్రరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎఇ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యుత్తును పొదుపు చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్కో సిబ్బంది, ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్ బి.గాసయ్య తదితరులు పాల్గొన్నారు.

21న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - బలిజిపేట

వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈనెల 21న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్వతీపురంలో నిర్వహించనున్న ఈ రక్తదాన శిబిరానికి పెద్ద ఎత్తున వైసిపి శ్రేణులు, యువత, అభిమానులు పాల్గొని ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసేవారు ముందుగా తమ పేరు, ఫోన్ నెంబర్ తప్పకుండా నమోదు చేసుకోవాలని కోరారు.

రహదారులను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చే బియ్యం వలస, డిపి వలస, పివిఆర్ పురం తండి గ్రామాల మధ్య రూ. 2కోట్ల 90 లక్షలతో నిర్మించిన బిటి రహదారులను గురువారం స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారులను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు నీలం సుధారాణి, శ్రీరాం, నరసింహులు, బి.వెంకటరమణ, ఉదయాన జగన్మోహన్‌రావు, కూటమి నాయకులు పి.కృష్ణమూర్తి నాయుడు, ఉదయాన ఉదయ్ భాస్కర్, లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, చింతా ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్‌కు చెందిన గౌడు కృష్ణారావు అనారోగ్యానికి గురవ్వడంతో సిఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బాధితుడికి రూ.36,005/- చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్నవారికి ఆపద్బాంధవ పరిస్థితుల్లో ప్రజలకు ప్రభుత్వం అండగా నిలవడం తమ బాధ్యతన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సహాయ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి చైర్‌పర్సన్ కడ్రక కళావతి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిత్తిరిలో ప్రజా సమస్యలపై సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని తిత్తిరి పంచాయతీ కేంద్రంలో ప్రజా సమస్యలపై గురువారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు అందించిన పలు సమస్యలతో కూడిన వినతిపత్రాలను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి వీలైనంత త్వరగా పరిష్కారం చూపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య, ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, తహశీల్దార్ కె. జయ, ఎ. నాగేశ్వరరావు, మండల పశు వైద్యాధికారి శైలజ, పంచాయతీరాజ్, హౌసింగ్ తదితర శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక పిఎంఆర్‌సి వద్ద ఎస్ఐ వై.అమ్మనరావు ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. హెల్మెట్ ధరించనివారిని ధరించాలన్నారు. మితిమీరిన వేగంతో వెళ్లరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

21న జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో రహిత భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా ఈనెల 21న పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. గురువారం స్థానిక జిల్లా వైద్యా, ఆరోగ్యశాఖ కార్యాలయంలో పల్స్‌పోలియోకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. అనంతరం డిఎంహెచ్ఒ మాట్లాడుతూ, జిల్లాలోని 0-5 ఏళ్ల వయస్సు గల 99,507 మంది చిన్నారులకు రెండు పోలియో చుక్కల మందు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా 905 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తల సమన్వయంతో ఈ బృహత్తర కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రయాణాల్లో ఉన్న పిల్లలకు సైతం పోలియో చుక్కలు అందేలా జిల్లాలోని ప్రధాన బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో 19 ట్రాన్సిట్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. మారుమూల ప్రాంతాలు, హై-రిస్క్ ఏరియాల కోసం 42 మొబైల్ బృందాలను రంగంలోకి దించుతున్నట్లు



బలిజిపేట: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

చెప్పారు. ఈనెల 21న పోలియో కేంద్రాలకు రాలేని చిన్నారుల కోసం 22, 23 తేదీల్లో వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి చుక్కలు వేస్తారని, తల్లిదండ్రులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.విజయ మోహన్, డాక్టర్ ఎం.వినోద్, లెప్రసీ, టిబి ఆఫీసర్ డాక్టర్ పిఎల్ రఘు, డాక్టర్ టి.జగన్మోహనరావు, డాక్టర్ కెఎస్ సూర్య కౌశిక్, ఉప జిల్లా మీడియా అధికారి డివి గిరిబాబు ఇతర సిబ్బంది ఉన్నారు.

సీతానగరం : ఈనెల 21న జరుగుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి పి.ఉషారాణి అన్నారు. స్థానిక పిహెచ్‌సి ఆవరణలో గురువారం ఆశా, ఎఎన్‌ఎంలు సిబ్బందితో సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి చిన్నారికి పల్స్ పోలియో వేయాలన్నారు. మిగిలిన వారికి ఈనెల 22, 23 తేదీల్లో ఇంటింటా తిరిగి పల్స్ పోలియో వేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.పావని, సిహెచ్ఒ ఎస్‌వి వెంకటరమణ, హెచ్‌వి భవాని, యుడిసి మురళి, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బలిజిపేట : పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని కోరుతూ బలిజిపేట పురవీధుల్లో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యాధికారి క్రాంతికిరణ్మయి మాట్లాడుతూ ఈనెల 21న జరగనున్న పల్స్‌పోలియో విజయవంతానికి అంతా సహకరించాలని కోరారు. బూత్ లెవెల్‌లో ఈనెల 22, 23న ఇంటింటికీ ఆశా, అంగన్వాడీ, వైద్య సిబ్బంది వెళ్లి సర్వే చేసి పల్స్ పోలియో చుక్కలు వేస్తారన్నారు.

క్వారీ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - పాచిపెంట

క్వారీ అనుమతికి సంబంధించి మండలంలోని పనుకువలస సమీపంలో పర్యావరణంపై జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి గురువారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టారు. మండలంలో గల పికోనవలస రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 531లో 14.40 హెక్టార్లలో ప్రభుత్వ స్థలాన్ని క్వారీ నిమిత్తం సాలూరు పట్టణానికి చెందిన నవదుర్గ మైనింగ్ ఇన్ఫ్రా యజమాని నెక్కింటి శ్రీనివాసరావు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు జెసి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో మైనింగ్, పర్యావరణశాఖల అధికారులు, పనుకువలస సర్పంచ్ సిహెచ్ సీతారామకృష్ణ, తహశీల్దార్ డి.రవి, ఎంపిడిఒ బివిజె పాత్రో, సాలూరు రూరల్ సిఐ రామకృష్ణ, పనుకువలస, మంచాడ వలస, విశ్వనాధపురం, జీగిరాం, చిన్న చీపురువలస, పెద్ద చీపురువలస, కోస్టు వలస. కందిరీ వలస. గ్రామాల ప్రజలు రైతులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి చర్యలు : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. గురువారం ఆయన జగతిపల్లి వ్యూ పాయింట్, సున్నపుగెడ్డ జలపాతం, చంద్రమ్మ తల్లి ఆలయం, పొల్ల వ్యూ పాయింట్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎక్కువమంది పర్యాటకులను ఆకర్షించేలా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. జగతిపల్లి వ్యూ పనులను పున:ప్రారంభించేందుకు చర్యలు చేపడతామన్నారు. సున్నపుగెడ్డ జలపాతం అభివద్ధికి చర్యలు తీసుకుంటామని అన్నారు. పర్యాటకులు కూర్చునే విధంగా వెదురుతో బెంచీలు ఏర్పాటు చేస్తామని అన్నారు. అనంతరం జగతిపల్లి జిపిఎస్ పాఠశాలను, అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని



విద్యార్థినులతో మాట్లాడుతున్న పిఒ

సూచించారు. అంగన్వాడీలో విద్యార్థులకు పోషకాహార భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం పెద్దపొల్ల బాలుర ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలో ముస్తాబు కార్యక్రమం పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. గడిగుజ్జి గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను పరిశీలించి రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఇసిఐ బిల్లు ప్రతులు దహనం

ప్రజాశక్తి - పాలకొండ

వికసిత్ భారత్ శిక్ష ఆదిక్షక్ బిల్లు-2025 (హెచ్ఇసిఐ) ప్రతులను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయం ముందు గురువారం విద్యార్థులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రాజేష్ మాట్లాడుతూ యూనియన్ క్యాబినెట్ 'వికసిత్ భారత్ శిక్షా అధిక్షక్ బిల్లు 2025' ఆమోదాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. గతంలో 2018లో ప్రవేశపెట్టిన 'హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా' బిల్లును, ఇప్పుడు 'వికసిత్ భారత్ శిక్షా అధీక్షక్' పేరుతో మార్చి కేంద్ర కేబినెట్ ఆమోదించడం సరికాదన్నారు. యుజిసి, ఎఐసిటిఇ, ఎన్‌సిటిఇ సంస్థల స్థానంలో హెచ్‌సిఇసి వంటి ఒకే నియంత్రణ సంస్థను తీసుకురావడం ద్వారా ఉన్నత విద్యా రంగాన్ని కేంద్రీకరించడమే ఈ బిల్లు లక్ష్యమన్నారు. ఎన్‌డిఎ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల మతతత్వీకరించడానికి ప్రయత్నిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఈ వికృత ఎజెండాను ఖరారు చేసే ప్రయత్నంలో భాగంగా ఈ చర్యని అన్నారు. ఈ బిల్లు ఆమోదం వల్ల దేశంలోని ఉన్నత విద్యా సంస్థల నిధులు, పనితీరులో భారీ మార్పులు వస్తాయన్నారు. ఇది సామాన్య విద్యార్థులపై నేరుగా ప్రభావం చూపుతుందన్నారు.



బిల్లు ప్రతులను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

యుజిసిని రద్దు చేయడం వల్ల వృత్తి విద్యా కోర్సులు లేని ఉన్నత విద్యా సంస్థల గొంతు నలుపు నెట్టడమవుతుందన్నారు. దీనివల్ల విద్య అనేది కేవలం ధనవంతులకు మాత్రమే అందుబాటులో ఉండే ఖరీదైన వస్తువుగా మారుతుందన్నారు. ప్రజలు, మేధావులు, విద్యార్థి సంఘాల తీవ్ర విమర్శిస్తున్నా బేఖాతరు చేస్తూ ఈ బిల్లును ఆమోదించడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణిని నిదర్శనం అన్నారు. రాష్ట్రాల్లోని విద్యా సంస్థలపై కేంద్రం తన భావజాలాన్ని రుద్దడానికి, వాటిపై పట్టు సాధించడానికి ఈ మార్పును ఒక సాధనంగా ఉపయోగించుకునే అవకాశం ఉందన్నారు. హెచ్ఇసిఐ బిల్లు రాజ్యాంగ విరుద్ధమైన చర్య అని, ఈ ఏకపక్ష చర్యను ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తుందని, తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ సభ్యులు అనిల్, గౌతమ్, కళ్యాణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువులు వాడకంతోనే ప్రయోజనం

ప్రజాశక్తి - సీతానగరం

సేంద్రీయ ఎరువుల వాడకం భూమికి, పంటకు ఎంతో ఉపయోగమని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీనివాసరాజు అన్నారు. మండలంలోని కె.వెంకటాపురంలో గురువారం రైతులతో ముఖాముఖి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యత, నానో యూరియా వాడకంతో ఎంతో ఉపయోగమన్నారు. రబీ పంటల్లో కలుపు యాజమాన్యానికి వ్యవసాయ యాంత్రీకరణకు డ్రోన్ వినియోగం దోహదపడుతుందన్నారు. శూన్యదుక్కితో మొక్కజొన్నలో కత్తిరి పురుగును నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అమృతవీణ, ఎఒ ఎస్.అవినాష్, విఎఎలు వినయ్, రాకేష్ శర్మ, రమణ రైతులు పాల్గొన్నారు.

పోడు పట్టాలు పంపిణీ చేయాలి

బొర్ర పనుకు వలస గిరిజనుల డిమాండ్ ● విచారణ చేపట్టిన తహశీల్దార్

ప్రజాశక్తి- సాలూరు

తమకు మంజూరైన పోడు పట్టాలను తక్షణమే పంపిణీ చేయాలని మండలంలోని బొర్రప నుకువలస గిరిజనులు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అటవీ పట్టాలను మంజూరు చేసినప్పటికీ,



విచారణ చేపడుతున్న తహశీల్దార్

కనీసం ఎరువులు కొనుగోలు చేయడానికి లేదా పండించిన పంటను ప్రభుత్వానికి అమ్ముకోవడానికి పాస్‌బుక్ నంబర్ లేక దళారులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల తమకు నేటికీ పట్టాలు అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన ఆదేశాల మేరకు ఆర్ఒఎఫ్ఆర్ తహశీల్దార్ సంతోష్ కుమార్ గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గిరిజనులు తహశీల్దార్‌కు తమ గోడును వివరించారు. సాగు చేస్తున్న తమకు పట్టాలు ఇవ్వకుండా, పక్క గ్రామాల వారికి పట్టాలు ఇచ్చి రెవెన్యూ సిబ్బంది తమను నానా ఇబ్బందులకు గురిచేశారని వారు ఆరోపించారు. పట్టాలు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు అందడం లేదని, గిరిజనుల సమస్యలను సావధానంగా విన్న తహశీల్దార్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ 'మీ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అర్హులైన ప్రతి గిరిజన రైతుకూ పట్టాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది' అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మర్రి శ్రీనివాసరావు, ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు వం తల సుందర్రావు, వ్యవసాయ కార్మిక సంఘం మం డల కార్యదర్శి తాడంగి గాసి, పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జులతో పాలన సాగేదెలా?

సర్పంచ్ గౌరీశంకర్రావు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం గ్రామ సచివాలయంలో ఇన్‌ఛార్జి పోస్టులతో అభివృద్ధి పాలన ఎలా సాగుతుందని సర్పంచ్ బి.గౌరీ శంకర్రావు ప్రశ్నించారు. ఇన్‌ఛార్జి పోస్టుల నియామకంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందన్నారు. మండల కేంద్రంలో ఉన్న సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఎఎన్ఎం మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని, ఏఎన్ఎం, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఇన్‌ఛార్జులు కావడంతో ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నారని అన్నారు. రేషనేలైజేషన్ పేరుతో పలు పోస్టులు తొలగించారని మిగిలిన పోస్టుల్లో కూడా ఇన్‌ఛార్జి పేరుతో సిబ్బందిని పక్క గ్రామాలకు నియమించారని చెప్పారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని ఫిర్యాదు చేయాలన్నా, స్థానికంగా సర్వేయర్ అందుబాటులో లేరని అన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన అగ్రికల్చర్ అసిస్టెంట్ లేరని, పిల్లలు, మహిళల సంరక్షణ కోసం ఉండాల్సిన మహిళా పోలీస్ పోస్టు లేదని, గ్రామ వ్యవస్థలో కీలకమైన స్ట్రీట్ లైట్ల నిర్వహణకు అవసరమైన లైన్మెన్ కూడా సచివాలయంలో లేరని ఆరోపించారు. పంచాయతీ వ్యవస్థకు మూలస్తంభమైన పంచాయతీ కార్యదర్శి (డిడిఒ) కూడా ఇన్‌ఛార్జిగానే ఉన్నారన్నారు. రెవెన్యూ సేవలు కూడా పరిమితంగానే అందుతున్నాయని, విఆర్ఒ కూడా ఇన్‌ఛార్జితోనే నడుస్తోందని చెప్పారు. ప్రజాస్వామ్యానికి కీలకమైన బిఎల్ఒలు కూడా లేని పరిస్థితి నెలకొందని ఈ పరిస్థితులన్నింటిని గమనిస్తే, మండల కేంద్రంగా ఉన్న గుమ్మలక్ష్మీపురం గ్రామంలో సచివాలయ వ్యవస్థ ఏ స్థాయిలో ఉందో స్పష్టంగా అర్థమవుతుందని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సచివాలయంలో రెగ్యులర్ పోస్టులు వేసి ప్రజలకు సకాలంలో సేవలందేలా చూడాలని కోరారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని టొంపలపాడు నుంచి తులసి గ్రామం వరకు రూ.4.46 లక్షల వ్యయంతో చేపట్టనున్న బిటి రహదారి నిర్మాణ పనులకు ప్రభుత్వవిప్, స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మౌలిక సదుపాయాల అభివృద్ధితో



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడి ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. గిరిశిఖర గ్రామాలకు పక్కా రహదారుల నిర్మాణమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, డోలి మోతలకు స్వస్తి పలకడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ కడ్రక కళావతి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, మండల టిడిపి కన్వీనర్ కె.వి.కొండయ్య, పిఎసిఎస్ చైర్మన్ డొల్లు కిషోర్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్, ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, తహశీల్దార్ కె. జయ, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

310 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండవ గ్రామ జంక్షన్ వద్ద గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ సహకారంతో ఏర్పాటు చేసిన మెగా నేత్ర వైద్య శిబిరంలో వైద్యులు గౌతమి 310 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 61 మందిని శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేసి విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. అలాగే 150 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఉచిత భోజన సదుపాయం కల్పించారు. అంతకు ముందు హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వి.ప్రశాంత్ జ్యోతిప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ డిజిఎం వి.రమేష్‌కుమార్, క్యాంపు మేనేజర్ బి.అప్పలరాజు, కో-ఆర్డినేటర్ సిహెచ్ వెంకటరమణ, ఆలయ ధర్మకర్త ఎం.సింహాచలం, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి కళాసీల సమ్మె

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రంలోని దుకాణాల్లో పని చేస్తున్న కళాసీలు శుక్రవారం నుంచి సమ్మె చేయాలని తీర్మానించారు. గురువారం దుర్గా కళాసీ సంఘం ఎఫ్‌సి గోదాం సమీపంలో సమావేశం నిర్వహించారు. కూలీ రేట్లు పెంచాలని స్థానిక వర్తక సంఘానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా వారి నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో సమ్మె చేయడానికి సంఘం తీర్మానించింది. 30శాతం మేరకు గతంలో ఇచ్చిన కూలి రేట్లు పెంపు చేయాలని కళాసీలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా వర్తక సంఘం, కళాశాల సంఘాలతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా కోరుతున్నారు. కార్యక్రమంలో కళాసీ సంఘం గౌరవాధ్యక్షులు ఎం.గోపాలం, బి.గౌర్నాయుడు, పి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు వేటగానివలస విద్యార్థి

పాచిపెంట: జాతీయస్థాయి పరుగు పందెం పోటీలకు మండలంలోని వేటగానివలస గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి సాగర రవికుమార్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట రమేష్ తెలిపారు. ఇటీవల జరిగిన స్టేట్ లెవెల్ అథ్లెటిక్స్ కాంపిటీషన్లో అండర్-17 విభాగంలో 400 మీటర్లు, 200 మీటర్లు రన్నింగ్లో పాల్గొని 400 మీటర్ల విభాగంలో జాతీయ స్థాయికి ఎన్నికై, ప్రస్తుతం లక్నోలో జరుగుతున్న జాతీయస్థాయి పోటీల్లో రవికుమార్ పాల్గొంటాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట రమేష్ తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన రవికుమార్‌ను హెచ్ఎం రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది తోటి విద్యార్థులు అభినందించారు.

ఎటిఎం పనిచేయక ఖాతాదారులకు ఇబ్బందులు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎటిఎం గత మూడు నెలలుగా పనిచేయకపోవడంతో నగదు కోసం ఖాతాదారులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని సుమారు 50వేల మంది ఖాతాదారులు ఉంటారని, దీనికోసం బ్యాంక్ అధికారులు లచ్చయ్యపేట, సీతానగరంలో ఎటిఎంలు ఏర్పాటు చేశారు. అయితే ఈ ఎటిఎంలు సక్రమంగా పనిచేయకపోవడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతూ డబ్బులు కోసం పార్వతీపురం, బొబ్బిలి వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. ఎటిఎంలో పనిచేయడం లేదని పలుమార్లు బ్యాంక్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదని, అది అవుట్సోర్సింగ్ వారికి అప్పజెప్పడం జరిగిందని దీనికి సంబంధించి మేమేం చేయలేమని చెబుతున్నారు. ఇప్పటికే ఎటిఎం చుట్టూ ఖాతాదారులు తిరుగుతున్నా పని చేయకపోవడంతో వెనుదిరుగుతున్నారు. ఇప్పటికైనా బ్యాంక్ అధికారులు కలుగజేసుకొని ఎటిఎంలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని ఖాతాదారులు కోరుతున్నారు

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ-1 జి.సూర్యదేవుడు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులను గ్రూపులుగా విడగొట్టి వారి విద్య సామర్థ్యాన్ని బట్టి వారి నుంచి మంచి నైపుణ్యం పంపించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం విద్యార్థుల్లో గ్రూపు ద్వారా స్టడీ పరిశీలించి వారిని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎఫ్ఎల్ఎన్‌జి కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలను పరిశీలించి విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి పెంచడంతో పాటు వారిలో ఉండే సామర్థ్యాన్ని పెంపొందినందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో టిఎఆర్ఎల్ జిల్లా కోఆర్డినేటర్ పి.ఉమా శంకర్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ

సీతానగరం : మండలంలోని జోగింపేట అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మమ్ముల విశ్వేశ్వరరావు సామాజిక కార్యకర్త పిల్లి సతీష్ 40మంది విద్యార్థులకు క్రీడాదుస్తులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఆటల్లో నైపుణ్యం వారిని ప్రోత్సహించేలా ఉంటుందని భవిష్యత్తులో విద్యార్థులు ఆటల్లో ప్రావీణ్యతను సంపాదించి మంచి పేరు తేవాలన్నారు. విద్యార్థులు విద్యతో పాటు ఆటల్లో రాణిస్తే వారి భవిష్యత్తు బంగారు బాటగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.రాజారావు, వైస్ ప్రిన్సిపల్ పి.ఈశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి పీసా చట్టంపై శిక్షణ

కొమరాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీసా చట్టంపై మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ ఎస్.రమేష్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 19 నుంచి 22 వరకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంపిపి శెట్టి శ్యామల, జడ్పిటిసి డి.లక్ష్మి ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

లక్షాధికారి అయ్యేలా ఆలోచించాలి : పీడీ

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రతి మహిళ తన జీవనోపాధి పెంపొందించుకుంటూ లక్షాధికారి అయ్యే విధంగా ఆలోచన చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సుధారాణి అన్నారు. గురువారం స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో జరుగుతున్న ఎంసిఎల్ఎఫ్ విజన్ బిల్డింగు శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సీడ్ క్యాపిటల్‌ను స్వధినియోగం చేసుకుని ఉన్న జీవనోపాధిని అభివృద్ధి పరుచుకోవాలని, చిన్న సంఘాల సభ్యులు వారి కుటుంబస్థితి మెరుగుపరుచుకోవాలని, లక్షాధికారులుగా తయారవ్వాలని, సంఘం లెక్కలు ప్రతి సభ్యులకి తెలుసుకునే విధంగా మన డబ్బులు మన లెక్కలు పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. దూర దృష్టి కలిగి కుటుంబ జీవనోపాదులు గురించి ఆలోచన చేయాలన్నారు. గ్రామ సంఘాలు మండల సమైక్యులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ సుధారాణి

అభివృద్ధి పదం వైపు నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం శ్రీరాములు, టిఒటికె రాము, సురేష్, ఎలొసివై ఆనంద్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు కె.లలిత కుమారి, నాలుగు మండలాల ఎపిఎంలు, సీసీలు, ఎంఎంఎస్ఇసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని చిన్నఅంటిజోల, రాముడుగూడ గిరిజన గ్రామాలను కషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ జి.అను, వై.ఉమాజ్యోతి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు, మహిళల కోసం పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలు గూర్చి అవగాహన కల్పించారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అమలు చేస్తున్న పశుసంవర్ధక, వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలను వివరించి రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా మహిళలకు అరటికాయ పిండితో చిన్నపిల్లలకు పోషకమైన ఫీడింగ్ ఫుడ్ తయారీ విధానాన్ని వివరించి ఇది పిల్లల ఆరోగ్యాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.మిన్నారావు, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శైలజ, అసిస్టెంట్ గంగారావు, పార్వతి రైతులు, మహిళలు పాల్గొన్నారు.